



ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
25-2-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 175

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కన్నతల్లి కరకశత్వం

**రెండునెలల చిన్నారి కిరాతక హత్య**

**కట్టెల పొయ్యిలో వేసి హతం**

**హైదరాబాద్:** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది.

## నేటినుంచి ఇంటర్ పరీక్షలు



- భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు
- 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం
- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

## శశికళ కొత్త పార్టీ ప్రారంభం

**పేరును త్వరలో ప్రకటిస్తానని వెల్లడి**



**చెన్నై:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ కీలక ప్రకటన చేశారు.

# గూడెం కింకర్తవ్యం?

### యూటర్న్ తీసుకున్న మహిపాల్ రెడ్డి?

- తిరిగి సొంత గూటికి చేరేందుకు తహతహ
- కాంగ్రెస్ లో ఇమడలేని పరిస్థితుల వల్లే
- మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి
- గులాబీ శిబిరంలో వ్యతిరేకిస్తున్న కొందరు

> 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి.. అనంతరం కాంగ్రెస్ లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో గూడెం మహిపాల్ రెడ్డి తీరు మొదటి నుంచీ భిన్నంగా కనపిస్తోంది. ఆయన కాంగ్రెస్ లో చేరనైతే చేరారు గానీ.. ఏనాడూ కాంగ్రెస్ నేతగా వ్యవహరించడంలేదు.

**ప్రభాత సూర్య , తెలంగాణ బ్యూరో )**



పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యవహారం తెలంగాణలో ఇప్పుడు 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. ఆయన ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియనట్లుగా ప్రవర్తిస్తుండడమే ఇందుకు కారణం. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్ రెడ్డి.. ఆ తరువాత కాంగ్రెస్ లో చేరారు. అయితే మునిసిపల్ ఎన్నికల్లో మాత్రం మళ్లీ బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేశారు. తిరిగి గులాబీ శిబిరానికి చేరే ప్రయత్నాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

2లో



## మా అరచాకాలను ఇక సహించేది లేదు

- మా నేతలను జైలులో పెడితే భయపడబోం
- నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్
- బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కెటిఆర్

**ఆదిలాబాద్, ప్రభాత సూర్య :** దిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.



## ఎంతకాలం ఉంటానో తెలియదు..

- అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

**డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు**

- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న
- 40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి

కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి



**హైదరాబాద్, ప్రభాత సూర్య :** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్

## రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు

### సాగునీరు అందించిన పాపాన పోలేదు



- నత్తనడకన వరంగల్ సూపర స్పెషాలిటీ నిర్మాణం
- అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చించడానికి సిద్ధం
- వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను పరిశీలించిన హరీష్ రావు

**వరంగల్, ప్రభాత సూర్య :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో దేవాదుల నుంచి ఒక్క ఎకరా భూమినీ సేకరించలేదని, సాగునీరూ అందించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదన్నారు.

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే



## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

- అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ
- మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్


## అంబర్‌పేటలో తీవ్ర విషాదం

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

### కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

- హోటల్ నడుపుతూ దర్జాగా బతుకుతున్న కుటుంబం
- ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

## కేరళ..ఇకనుంచి కేరళం




### కేంద్ర కేబినేట్ తీర్మానం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్టాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో



# గూడెం కింకర్తవ్యం?

(మొదటి పేజీ తరువాయి)

తన కార్యాలయంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో కాకుండా.. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటోనే పెట్టుకుంటున్నారు. దీనిపైనే స్థానిక కాంగ్రెస్ నేతలకు, ఆయనకు మధ్య వివాదం రేగింది. నిజంగా కాంగ్రెస్ లో చేరితే.. తక్షణమే కేసీఆర్ ఫొటో తొలగించాలని, సోనియాగాంధీ, రేవంత్ రెడ్డి ఫొటోలు పెట్టాలని.. ఇంటిపై కాంగ్రెస్ జెండాఎగరేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు ఆయన కార్యాలయం ముందు ధర్నా కూడా చేశారు. కానీ, మహిపాల్ రెడ్డి మాత్రం అందుకు ససేమిరా అనడంతో.. ఆయన తీరు అప్పటినుంచి వివాదాస్పదమవుతోంది. చివరికి ఆయన కాంగ్రెస్ కు దూరమయ్యారు. ఇదే విషయాన్ని బహిరంగంగా కూడా ప్రకటించారు. పైగా, పటాన్ చెరు నుంచి ఆయనపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ తో మహిపాల్ రెడ్డికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం నెలకొంది. ఇది రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తూ.. మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ లో ఉండలేని పరిస్థితుల్ని సృష్టించింది.

### బీఆర్ఎస్ కేసు వేయడంతో..

నిజానికి మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున వరుసగా మూడోసారి గెలిచారు. కానీ, 2023 ఎన్నికల అనంతరం.. పార్టీ మారిపోయాక నేరుగా బీఆర్ ఎస్‌పైనే ఆయన విమర్శలు చేశారు. ఆయన, ఫిరాయింపు ఎమ్మెల్యేల జాబితాలో చేరిపోవడంతో ఇతర ఎమ్మెల్యేలతోపాటు ఈయనపైనా అనర్హత వేటు వేయించాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం స్పీకర్ వద్ద ఉంది. నాటి స్పీకర్ విచారణలో మహిపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీరు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు కదా.. బీఆర్ ఎస్‌లో ఉన్నానని ఎలా చెబుతున్నారు అన్న ప్రశ్నకు.. అది కాంగ్రెస్ కండువనా? అట్లేమీ లేదే? జాతీయ జెండా లెక్క ఉండె. అందుకే మెడలో ఏసుకున్న అంటూ.. తనదైన స్లాంగ్‌లో సమాధానమిచ్చారు. కానీ.. అప్పటికే బీఆర్ ఎస్ అధినేత తాను చేయాల్సిన పని పూర్తి చేశారు. పటాన్ చెరు నియోజకవర్గానికి ఆదర్శ్ రెడ్డిని ఇంచార్జ్ గా నియమించారు. ఇటీవలి కాలంలో ఆయనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే.. మహిపాల్ రెడ్డి తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని 5 మునిసిపాలిటీలను బీఆర్ ఎస్‌కు దక్కేలా ప్రచారం చేశారు. ముఖ్యంగా ఇస్నాపూర్‌లో తన ఎక్స్ అఫిషియో ఓటు వేసి.. చైర్మన్ గిరీని కూడా బీఆర్ ఎస్‌కు దక్కేలా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ ఎస్ గూటికి తిరిగి వచ్చేందుకు మహిపాల్ రెడ్డి నిర్ణయించుకున్నారని.. ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఇప్పటికే బీఆర్ ఎస్‌పై విమర్శలు చేయడం.. కాంగ్రెస్ కండువాను కూడా కప్పుకొన్న నేపథ్యంలో కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి. చిత్రం ఏంటంటే.. మహిపాల్ రెడ్డి సోదరుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కానీ.. స్థానిక నాయకులు మాత్రం మహిపాల్ రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన మునిసిపాలిటీలు బీఆర్ఎస్ కు దక్కేలా కృషి చేసినా...మిగతావారు గతాన్ని తవ్వుతున్నారు. అనర్హత వేటుకు భయపడే గూడెం ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మహిపాల్ రెడ్డి భవితవ్యం గులాబీ బాస్ కేసీఆర్ తీసుకునే నిర్ణయం పైనా ఆధారపడి ఉండనుంది.

# అంబర్‌పేటలో తీవ్ర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

మృతులను భర్త రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)గా గుర్తించారు. తొలుత మాధవిని రామరాజు, శశాంక్ ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వారిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హోటల్ వ్యాపారంలో నష్టం, అప్పుల వారి వేధింపులతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు ఎన్నో ఏళ్లుగా హోటల్ బిజినెస్ చేస్తున్నారు. కానీ ఏం కష్టం వచ్చిందో తెలియదు? అర్ధాంతరంగా ఈ కుటుంబం తనువు చాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతికి ఆర్థిక భారం కారణం అంటూ సూసైడ్ నోట్ రాశారు. నిజంగానే వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? లేక పరువు పోతుందేమోనన్న భయంతో ముగ్గురు సూసైడ్‌కు పాల్పడ్డారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అంబర్ పేట్ లోని బాపూజీ నగర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ల్యాండ్ మార్క్ హోటల్ యజమాని కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య పాల్పడ్డారు. మృతులను రామ్‌రాజ్, మాధవి, శశాంక్‌గా గుర్తించారు. హైదరాబాద్ అంబర్ పేట్‌లో ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని రామ్‌రాజ్ ఫ్యామిలీ సూసైడ్ చేసుకున్న వార్త స్థానికంగా కలకలం సృష్టించింది. రామ్ రాజ్ ఫ్యామిలీ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట్‌లోనే నివాసం ఉంటున్నారు. సొంతిల్లు.. పెద్ద భవనం.. కోట్లలో ఆస్తులు ఉన్నాయి. కానీ ముగ్గురు సూసైడ్ చేసుకోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.. రామ్ రాజ్ ముందు భార్య మాధవిని చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. మరోవైపు రామ్‌రాజ్ కుమారుడు శశాంక్ తన ఎడమ చేయి కోసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కానీ అతను చనిపోకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నట్లు రామ్‌రాజ్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. తన ఆస్తులు మొత్తం తన కూతురికేనంటూ వీలునామా కూడా రాసినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌రాజ్ కూతురు అమూల్య కొంపల్లిలో ఉంటున్నట్లు తెలుస్తోంది. సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు పోలీసులు. రామ్‌రాజ్ కూతురు ఏదైనా కోణంలో అనుమానం వ్యక్తం చేస్తే.. ఆ దిశగా కూడా విచారణ చేస్తామని చెప్పారు పోలీసులు. ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని కుటుంబం మృతిపై రామ్‌రాజ్ అన్న జగదీశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పెద్ద సమస్య కాదని, తమది వెల్ సెటిల్డ్ కుటుంబం అని చెప్పారు. తమకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు జగదీష్. నా తమ్ముడు ఫ్యామిలీ సూసైడ్ ఎందుకు చేసుకున్నారో.. అసలు ఏం జరిగిందో తెలియడం లేదని కంటతడి పెట్టారు. మరోవైపు తెల్లవారు 3 గంటల 15 నిమిషాలకు రవి అనే మిత్రుడికి రామ్ రాజ్ వాట్సాప్‌లో సూసైడ్ చేసుకున్నామని మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తన మిత్రుడు రామ్ రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యభర్తలు ఇద్దరు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు రవి. రామ్ రాజ్.. అంబర్‌పేట్‌లో ల్యాండ్ మార్క్ హోటల్, మల్లేపల్లిలో బిరియాని సెంటర్, మల్లాపూర్‌లో కింగ్స్ హోటల్, చక్రిపురంలో మరొక హోటల్ నిర్వహిస్తున్నారు. ఐతే ఎవరైనా అప్పులు ఇచ్చిన వారు భయపెడితే చనిపోయారా? ఎవరైనా భయపెట్టారా? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

# ఎంతకాలం ఉంటానో తెలియదు..

**వాషింగ్టన్, ప్రభాత సూర్య :** నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?‘ అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు.

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ - ప్యూర్ - రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

**భోపాల్, ప్రభాత సూర్య :** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# కేరళ..ఇకనుంచి కేరళం

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మరోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్ర్య పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# కన్నతల్లి కరకశత్వం

బాలుడిని కట్టెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్ కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

# శశికళ కొత్త పార్టీ ప్రారంభం

తమిళనాట కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కొత్త రాజకీయ చరిత్రను మనం చూడబోతున్నామని, కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ద్రవిడ ఉద్యమం స్ఫూర్తితో అన్నాదురై, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ అడుగుజాడల్లో పార్టీని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. పేదలు, బడుగు వర్గాలు, సామాన్య ప్రజానీకం కోసం పార్టీ పాటుపడుతుందని, శత్రువులు, ద్రోహులను ఏరివేస్తామని శశికళ తెలిపారు. పార్టీ జెండాను ఈ సందర్భంగా శశికళ ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగి, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్తరువులతో ఈ జెండా రూపొందింది. పార్టీ పేరును త్వరలోనే ప్రకటిస్తామని శశికళ తెలిపారు. 2016లో జయలలిత మరణాంతరం జరిగిన సంఘటనలను శశికళ గుర్తుచేసుకుంటూ, అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా తనను ముఖ్యమంత్రి కావాలని కోరారని చెప్పారు. 'చిన్నమ్మా... మీరు తప్పనిసరిగా ముఖ్యమంత్రి కావాలి అని వాళ్లంతా నాతో అన్నారు' అని తెలిపారు. అయితే ఆ సమయంలో తాను వ్యక్తిగత పనులు ఉండటంతో అందుకు నిరాకరించానని, ఓ పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆ తదుపరి క్రమంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళను అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ప్రథమార్ధంలో జరగాల్సి ఉన్నాయి.

## రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు

ఈ ప్రభుత్వానికి డేట్‌లు, డెడ్‌లైన్‌లు మాత్రమే మారుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్‌ను తాము సందర్శించిన వెంటనే సీఎం రివ్యూ చేశారని.. తాము తట్టిలేపితేనే సీఎం నిద్ర లేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యమని చెబుతూనే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసెంబ్లీలో కెమెరా తిప్పకుండా, మైక్ కట్ చేయకుండా చర్చించే దమ్ము సీఎంకు ఉందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# పసికందు హత్య అత్యంత దుర్మార్గం

- ఇది కుల దురంకార హత్య..
- హంతకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలి..
- ఆర్.సీత,రాష్ట్ర సహాయ కార్యదర్శి.ప్రగతిశీల మహిళా సంఘం (POW).....

**ఆలేరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య.:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో కుల దురహంకార దాడి, పసికూనను హత్య చేయడం అత్యంత దుర్మార్గం,ఇది కరడుగట్టిన కుల దుర్మార్గానికి పరాకాష్ట అని,హంతకులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని,ఇలాంటి అమానవీయమైన ఘటనలు పునరావృతం కాకుండా గట్టిచర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీ ఓ డబ్ల్యూ)తెలంగాణ రాష్ట్ర సహయ కార్యదర్శి ఆర్.సీత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆలేరు లో మంగళవారం రోజున మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వంత జిల్లాలోనే జరిగిన ఈ దారుణ ఘటనన సభ్య సమాజం తీవ్రంగా ఖండించాలని,నిరసన వ్యక్తం చేయాలని సీత అన్ని వర్గాల,రంగాల ప్రముఖులు,ప్రజలు, మహిళా సంఘాలు,విద్యార్థి, యువజన సంఘాలను కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండలంలోని కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా చాకలి కుటుంబంపై ఆధిపత్య రెడ్డి కుల దౌర్జన్య కారులు అరాచకత్వాన్ని ప్రదర్శించి, ఐదు నెలల పసికందును కాళ్లతో తన్ని, గొంతు నులిమి చంపడం అమానుషం, క్రూరత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఈ ఘటనను కేవలం ఒక కుటుంబంపై జరిగిన దాడిగా కాకుండా, మహిళల గౌరవంపై, దళిత, బీసీ,మైనారిటీ సమాజంపై, మానవ హక్కులపై జరిగిన దాడిగా



చూస్తోందని అన్నారు. ఏమాత్రం జవాబుదారీతనం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ, నిందితులు ఉద్యాల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఇతర వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని సీత డిమాండ్ చేశారు. మల్లన్న దర్శనం కోసం వచ్చిన ఆ కుటుంబం తమ దగ్గర డబ్బులు లేవని, బయట నుంచే దర్శనం చేసుకుంటామని చెప్పినా వినకుండా ఆధిపత్య కుల, వర్గ అహంకారంతో దళిత మహిళను అసభ్య పదజాలంతో దూషించడం, ఆమెను, ఆమె భర్తను గదిలో బంధించి కులం పేరుతో అవమానించడం, దాడి చేయడంను రాష్ట్ర ప్రభుత్వం ,పోలీస్ వ్యవస్థ తీవ్రంగా పరిగణించాలని కోరారు. తల్లి కళ్లముందే ఐదు నెలల తన బిడ్డ హత్యకు గురవుతుంటే ఆ తల్లి ఎంత తల్లడిల్లిందో నని బాధను వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగి ఐదు రోజులు గడిచినా కూడా నిందితులను అరెస్ట్ చేయకపోవడం అత్యంత ఆందోళనకరం అని ,అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయని. స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతుతో నిందితులు తప్పించుకుంటున్నారనే వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని,ప్రతిపక్ష నేతలు తమ మౌనంతో ఇటువంటి నేరాల పట్ల, సామాజిక అణచివేత పట్ల ఆమోదాన్ని తెలియజేయడమే అవుతుందని, మహిళలపై, అణగారిన వర్గాలపై జరుగుతున్న ఇలాంటి దాడులు సమాజానికి ప్రమాదకరమని అందుకు ప్రజలు ఇలాంటి దుర్మార్గుల పట్ల,ఘటనల పట్ల చాలా జాగ్రత్తగా ఉండి కుల దురాంకార,దుర్మార్గపు చర్యలను ఎదుర్కోవాలని కోరారు. ఈ ఘటనపై వేగంగా న్యాయ విచారణ జరగడానికి ప్రత్యేక/ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని,బాధిత కుటుంబానికి సముచిత న్యాయం చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కొండూరు గ్రామంలో సంఘ బంధం భవన నిర్మాణానికి శంకుస్థాపన

**మర్రిగూడ ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య :** మండలంలోని కొండూరు గ్రామంలో సంఘ బంధం భవన నిర్మాణానికి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం రోజున శంకుస్థాపన చేశారు జాతీయ ఉపాధి హామీ పథకం కింద పది లక్షల రూపాయల వ్యయం తో మంజూరు అయిన ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు ఏపిఎం , వెంకట్ తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతారాం నాయక్, ఉప సర్పంచ్ జాల యాదయ్య, ఎంపీడీవో మునయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు



## రైతు భరోసా కోసం రైతుల ఎదురుతెన్నులు

### రైతుసంఘం నేతలు

**మిర్యాలగూడ ఫిబ్రవరి 24:-( ప్రభాత సూర్య):** తెలంగాణలో రైతాంగం మొత్తం రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నార 3 నెలలుగా రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న రైతాంగంకు క్యాబినెట్ సమావేశంలో చర్చించారా..? లేదా అనేది రైతాంగానికి ఆత్రుతగా ఉందని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఆర్.మంగారెడ్డిలు ప్రశ్నించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ యాసంగి సీజన్ లో ఎకరానికి రూ.6,000ల చొప్పున అందించాల్సిన రైతు భరోసా ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన లేదని, సిఎం రేవంత్ రెడ్డి రైతు భరోసాపై పలుమార్లు ప్రకటించిన అమలుకు నోచుకోక పోవడం విచారకరమన్నారు. యాసంగి సీజన్ కూడా పూర్తి కావస్తుంది. అయినా రైతు భరోసా అందడం లేదన్నారు.జనవరి మొదటి వారంలో అని ఒకసారి, సంక్రాంతి పండుగకు అని ఒకసారి, జనవరి నెలాఖరు అని మరోసారి, మున్సిపల్ ఎన్నికల అనంతరం వెంటనే రైతు భరోసా అందిస్తామని ప్రకటనలు మాత్రం వచ్చాయని, రైతులకు మాత్రం వారి ఖాతాలలో డబ్బులు జమ కాలేదన్నారు. ప్రభుత్వం అందించే పథకం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పథకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కనీసం రైతు భరోసాపై చర్చ కొనసాగలేదన్నారు. రైతులకు భరోసా ఎప్పుడు



అందిస్తారనే విషయం ఇంకా స్పష్టత రాకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

యూరియా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్ ను ప్రవేశపెట్టడం వల్ల రైతులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. వరిపొలాలు పొట్ట దశలో ఉన్నాయని ఈ సమయంలో యూరియా అవసరం ఎక్కువగా ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన యాప్ మూలంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని, అందుకే ప్రభుత్వం యాప్ విధానాన్ని రద్దుచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## పట్టణ ప్రాంతాల్లోని భూములు, ఆస్తులపై భౌగోళిక సమాచార నక్షా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

### సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 24:- (ప్రభాత సూర్య):** పట్టణ ప్రాంత భౌగోళిక సమాచారం, పట్టణ భూములు, ఆస్తుల హక్కులు కల్పించే నక్షా (నేషనల్ జియో స్పెషియల్ నాలెడ్జి – బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్)భూ రికార్డుల హక్కులు కల్పించడానికి సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కోరారు. మంగళవారం సబ్ కలెక్టరేట్ లో నక్ష గురించి రెవిన్యూ, ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్, మునిసిపల్ మునిసిపల్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపడుతున్న ఒక ఫ్లాగ్‌షిప్ పథకం అన్నారు. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లోని భూములు, ఆస్తులపై భౌగోళిక సమాచార ఆధారిత కడాస్ట్రల్ సర్వే నిర్వహించి, వ్యవసాయ భూముల తరహాలోనే పట్టణ భూములకు కూడా హక్కుల రికార్డు (రికార్డు ఆఫ్ రైట్స్ -- ఆర్ఓఆర్) ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా 10 మున్సిపాలిటీల్లో అమలు చేయడానికి ఎంపిక చేశారని అందులో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఒకటన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద మిర్యాలగూడ మున్సిపాలిటీ



పరిధిలోని అన్ని ఆస్తులపై వివరణాత్మక పట్టణ సర్వే (డిటైల్డ్ టౌన్ సర్వే -- డీటీఎస్) నిర్వహించి కడాస్ట్రల్ రీ--సర్వే చేపడతారు. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలలో విమాన సర్వే (ఏరియల్ ఫ్లైయింగ్ ) నిర్వహిస్థారన్నారు. పట్టణానికి సంబంధించిన 2డి ఆర్థో--రెక్టిఫైడ్ చిత్రాలు, 3డి భౌగోళిక డేటా రూపొందించబడుతుందన్నారు.అనంతరం సర్వే డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు జీఎన్ఎస్ఎస్ రోవర్లు, డేటా సేకరణ టాబ్లెట్ల సహాయంతో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. సర్వేను పూర్తి చేయడానికిగాను 5 టీమ్స్ ఏర్పాటు చేశారన్నారు. పంట పొలాల సర్వే నంబర్లా సర్వేతో కొత్త ఇంటి నంబర్లు, పట్టణ భూముల సర్వే నంబర్లు వస్తాయని అన్నారు. పట్టణ ప్రజలు ఇంటికి సంబంధించిన వివరాలు తెలపాలన్నారు. నేటి నుండి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్షకి పట్టణ ప్రజలు పూర్తిగా సహకరించాలని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ కోరారు. సర్వేలో మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అధికారులు వస్తారన్నారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నల్లగొండ అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజు, డిఎఓ శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్ పి.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, టీపీఎస్ కె.అంజయ్య, టిపిబిఓ చరణ్, ఆర్ఐలు రామకృష్ణ, క్రిష్ణయ్యలు పాల్గొన్నారు.



## క్రీడాకారులకు కిట్లు అందజేసిన శనిగరం..

**ఆలేరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య :** ఆలేరు మండలంలోని శారాజిపేట గ్రామానికి చెందిన క్రీడాకారులకు యువతకు శాలివాహన సంఘం మండల ఉపాధ్యక్షులు శనిగరం హరీష్ 3000 రూపాయలు విలువ చేసే వాలీబాల్, నెట్ కిట్లను మంగళవారం రోజున అందజేశారు. యువతకు క్రీడా కిట్లతో సహాయ సహకారాలు అందించినందుకు గ్రామ ప్రజలు అభినందించారు. తన వంతు సహాయంగా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో రాహుల్, రాజు, అనిల్, సునీల్, శ్రీను, భరత్, నరేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన




**మాదాపూర్ ప్రభాత సూర్య :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం హైటెక్ కమాన్ వద్ద 'అరైవ్ అలైవ్' రెండో దశ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ వాహనదారులకు లేన్ క్రమశిక్షణ, సరైన ఓవర్‌టేకింగ్ విధానం, ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు విధిగా హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించే వారందరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రాణాపాయాలను వివరిస్తూనే, సురక్షిత ప్రయాణానికి పాటించాల్సిన డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ట్రాఫిక్ సిబ్బంది చురుగ్గా పాల్గొన్న ఈ కార్యక్రమంలో రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో వివరించారు.

## మౌలిక వసతుల లోటుపై నేతల దృష్టి...

### గంగారం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన

### అంగన్వాడీ సమస్యలపై దొంతి శేఖర్ ముదిరాజ్ ఆరా....




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** గంగారం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల లోటుపై స్థానిక నేతలు సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్ హెడ్మాస్టర్ సుభాష్‌తో పాటు ఉపాధ్యాయ బృందంతో సమావేశమై తరగతి గదుల కొరత, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్వహణ లోపాలు, ఫర్నిచర్ అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన వసతులు సమకూర్చే దిశగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత, భవనాల దుస్థితి, పోషకాహార సరఫరా సమస్యలపై కూడా దొంతి శేఖర్ ముదిరాజ్ ప్రత్యేకంగా ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రభావం పడకుండా తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ భీమమ్మ పాల్గొన్నారు.

## దివ్యభారతి కి ఘన నివాళులర్పించిన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం నేతలు

**ఖమ్మం(ప్రభాత సూర్య ప్రతినిధి):** తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం కల్లూరు మండల అధ్యక్షులు రాళ్లబండి వీర బ్రహ్మాచారి భార్య రాళ్లబండి దివ్యభారతి దశదిన కార్యక్రమానికి హాజరైన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలూరి నరసింహరావు రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నారపు నగేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వీరభద్రం జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి షేక్ సిద్దు జిల్లా కోశాధికారి కమర్తపు వీర నాగేశ్వరావు జిల్లా కార్యవర్గ సభ్యులు టివీకే చారి పెనుగోలు మండలం అధ్యక్షులు చావగాని నాగరాజు మండల కార్యవర్గ సభ్యులు నెలకుర్తి గణేష్ మోదుగు నాగమల్లేశ్వరరావు బండారు గోపి మండల తదితరులు పాల్గొన్నారు.






## సమిష్టి సహకారంతో ఇంద్రేశంను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య :** మండలం లోని నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీని సమిష్టి సహకారం, సమన్వయంతో ఆదర్శంగా తీర్చిదిద్దుదామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ తొలి పాలకవర్గ సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులుగా పని చేసే అవకాశం కొద్ది మందికే లభిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే ఐదేళ్లపాటు ప్రతి వార్డుని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఇంద్రేశం మున్సిపల్ అభివృద్ధికి ఇప్పటికే 15 కోట్ల రూపాయలు మంజూరు కావడం జరిగిందని.. అతి త్వరలో వీటికి సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సి ఎస్ ఆర్ నిధులను సైతం అభివృద్ధి పనులకు కేటాయించబోతున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఇంద్రేశం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుశంగుల ప్రమీల, వైస్ చైర్మన్ పట్లోల్ల హరీష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడారంగ , వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం



**మిర్యాలగూడ ,ఫిబ్రవరి 24 :-( ప్రభాత సూర్య):** వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం పి ఈ టి ఏ ఆధ్వర్యంలో డైరీని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై రాష్ట్ర శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 1803 ఉన్నత పాఠశాలలో నూతనంగా పీఈటి పోస్టులు మంజూరు చేయాలని, రేషనలైజేషన్ జీవో 25 ను ఈ క్రింది విధంగా సవరించాలని ,అన్ని యజమాన్యాల ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు పైబడి ఉన్నట్లయితే రెండవ జూవ్ లేక పిడిని, 500 మంది విద్యార్థులు పైబడి ఉన్నట్లయితే మూడవ పిఇ టి లేక పిడిని, 750 మంది విద్యార్థులు పైబడి ఉన్నట్లయితే అదనంగా నాలుగవ పిడి లేక పి ఈ టి ని కేటాయించాలని, స్పోర్ట్స్ కోట జీవో 74 సవరించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోట రిజర్వేషన్ను మూడు శాతానికి పెంచాలని, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల ట్రాన్స్ఫర్లలో, పదోన్నతులలో, మరియు నూతన ఉద్యోగాల భర్తీ చేయుటలో మీడియాలతో సంబంధం లేకుండా అన్ని మీడియాల పాఠశాలలకు అవకాశం కల్పించాలని, ఎస్ జి ఎఫ్ క్రీడలలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్స్ కు ముందస్తుగా బడ్జెట్ కేటాయించాలని, అదేవిధంగా రాష్ట్ర స్థాయి టీములను జాతీయ స్థాయి టోర్నమెంట్ కు పూర్తిగా ఒస్త్రట రాష్ట్ర ఆఫీసు ఆధ్వర్యంలో పంపించాలని కోరడం జరిగింది, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలకు జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని, ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ముఖ్యమంత్రి కి వినతి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం పెట టిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆదినారాయణ అశ్వరావుపేట ఎమ్మెల్యే,, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి , రాష్ట్ర అధ్యక్షులు బి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ నాగరాజు,కోశాధికారి శక్రు నాయక్, విద్యాసాగర్ రెడ్డి, చంద్రయ్య, బి వెంకట రత్నం , కట్ట శ్రీనివాస్, బాబు శ్రీనివాస్ గౌడ్, అయితగోని శ్రీనివాస్, జగన్మోహన్ గౌడ్, భాస్కర్ రెడ్డి, తోట సతీష్,వెంకట్ రెడ్డి, దినేష్ కుమార్, సత్తిరెడ్డి, వాడెన్న, కుమారస్వామి, దేవేందర్, యాదయ్య , రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎం నగదు దొంగను అరెస్ట్ చేసిన గచ్చిబౌలి పోలీసులు...

### రూ.34.90 లక్షలు స్వాధీనం.....



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం నగదు రవాణా వాహనం నుండి నగదు అపహరణ చేసిన కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన గోపనపల్లి తండా ప్రాంతంలో ఏటీఎంలకు నగదు సరఫరా చేస్తున్న వాహనం నుండి రూ.56 లక్షల నగదు అపహరించిన ఘటన చోటుచేసుకుందని తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు అదే రోజు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో క్రైం నం.278/2026గా ఖ/o 306 దీచీా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.కాగా కేసుదర్యాప్తులో భాగంగా సంఘటనా స్థల పరిశీలన, సీసీటీవీ ఫుటేజ్ సేకరణ, సాంకేతిక ఆధారాల విశ్లేషణ, సంబంధిత సిబ్బంది విచారణ చేపట్టారన్నారు. సికింద్రాబాద్ డైమండ్ పాయింట్ నివాసి అయిన నిందితుడు బడిగెరే అజిత్ కుమార్ ఏ శివ (34) సంగెం సెక్యూరిటీ ఏజెన్సీలో డ్రైవర్గా విధులు నిర్వర్తిస్తున్నాడని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా బొమ్మనహాల్ స్వస్థలం. ఏటీఎంలో నగదు ఫిల్ చేస్తున్న సమయంలో సహచరులు వాహనం బయట ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని అజిత్ కుమార్ వాహనాన్ని నగదుతో సహా తీసుకొని పారిపోయాడన్నారు. కొంతసేపు తోటి సిబ్బందిని మభ్యపెట్టి గద్దర్ చౌరస్తా, నల్లగండ్ల ప్రాంతాలకు వెళ్లి నగదు ఉన్న ట్రంక్ బాక్స్ను తీసుకుని వాహనాన్ని అక్కడే వదిలి ఆటోలో పారిపోయాడని తెలిపారు.అదే రోజు రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతంలోని ఒక లాడ్జ్లో సాధారణ ప్రయాణికుడిలా దిగాడన్నారు. యాక్స్ బ్లేడ్తో నగదు పెట్టెను తెరిచి డబ్బును బ్యాగ్లో పెట్టుకుని ఈనెల 13వ తేదీన అనంతపూర్కు వెళ్లాడు. అనంతరం బళ్లారి, బెంగళూరు, పుణే ప్రాంతాల్లో తిరుగుతూ పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు.సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు మంగళవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అదే రోజు విచారణలో అతని వద్ద నుంచి ?.34,90,000/- నగదు స్వాధీనం చేసుకుని సీజ్ పంచనామా నిర్వహించామని తెలిపారు. మిగిలిన నగదును జల్సాల కోసం వాడుకున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడిని రిమాండ్కు తరలించామన్నారు. డ్రైవర్ల నియామకంలో నిర్లక్ష్యం వహించిన సంగం సెక్యూరిటీ ఏజెన్సీపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ చట్టం--2005 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా ఈ కేసు దర్యాప్తులో భాగంగా అప్రమత్తంగా వ్యవహరించి నిందితుడి అనుమానాస్పద కదలికలను గమనించి పోలీసులకు సమాచారం అందించిన ఎస్వీఆర్ బస్ ట్రావెల్స్ డ్రైవర్ ఉమాకాంత్ను పోలీసులు అభినందించారు.ఈ కేసును డీసీపీ శేరిలింగంపల్లి జోన్ సీ హెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, అదనపు డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో, నార్సింగి సీసీఎస్ మాదాపూర్ సహకారంతో గచ్చిబౌలి పోలీసులు, డిటెక్టివ్ విభాగం, క్రైమ్ బృందం సమన్వయంతో ఛేదించారు.

# ఆడపిల్లల్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

### అన్ని డిపార్ట్మెంట్ల సహకారంతో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం లి సీడీపీఓ మమత





**మిర్యాలగూడ ఫిబ్రవరి 24:- (ప్రభాత సూర్య ):** ఆడపిల్లల విద్యా రక్షణ అందరి బాధ్యత అని మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని మిర్యాలగూడ మండల స్థాయి బేటి బచావో బేటి పడావో సమావేశం సీడీపీఓ మమత అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలోని అన్ని డిపార్ట్మెంట్ల వాళ్ళ సహకారంతో. బేటి బచావో-బేటి పడావో(బిబిబిపి) కార్యక్రమంలో ఆడపిల్లల్ని కాపాడు కోవడం అందరి బాధ్యత, ఆడపిల్లలు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఆడపిల్లలకి ఎలాంటి ఆపద వచ్చినా అక్కున చేర్చుకోవ డానికి బాలసదనాలు న్నాయన్నారు. ఆడపిల్లలు వద్దనుకు న్న వాళ్లు ప్రభుత్వ ఆసుపత్రులలో ఏర్పాటుచేసిన ఉయ్యాలలో వేయాల న్నారు. అంతేగాని అక్రమ దత్తత ఇవ్వకూడదన్నారు. తహసీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లా డుతూ బాలలకి భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరి పైన ఉంది అన్ని డిపార్ట్మెంట్లో కలిసి పనిచేసినట్లైతే సమస్యలను తగ్గించగలుగుతామన్నారు. ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ కమిటీలు పర్యవేక్షణ చేస్తూ గ్రామాలలో ఆడపిల్లల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ దత్తత చట్ట విరుద్ధమన్నారు. ఆడపిల్లలు డ్రాప్ ఔట్ కాకుండా అందరూ చదువుకోవాలని, బాల్య వివాహాలు చేసుకోకూడదని అందరూ చదువుకొనేల చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్కె.మొయిద్, మండల విద్యాధికారి ధర్మానా యక్, మహిళ శక్తి ఏపీఎంలు దిలీప్, నిజాముద్దీన్, సహాయ కార్మిక అధికారి శేషారత్నం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం రమనీ, పోలీసు శాఖ పిసిలు ఉషా, అరుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు బి.రాధిక, వాణి, నిహారిక పాల్గొన్నారు

# మహిళా సమ భావన సంఘం భవనానికి శంకుస్థాపన







**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి24( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా, మునుగోడు నియోజకవర్గం, సంస్థాన్ నారాయణపూర్ మండలంలోని గుడిమల్కా పురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 గ్రాంట్ ద్వారా మంజూరైన మహిళా సమ భావన సంఘం ( వివో) భవన నిర్మాణానికి ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది.జిల్లా కలెక్టర్, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో సుమారు రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబడనున్న ఈ భవనానికి గ్రామ సర్పంచ్ మన్నె శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తమ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా సమ భావన సంఘం గ్రామ అభివృద్ధికి, మహిళల ఆర్థిక సాధికారతకు, సామాజిక ఐక్యతకు ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సంఘానికి స్వంత భవనం ఏర్పడటం వల్ల మహిళలు, యువత, సభ్యులు సమావేశాలు, శిక్షణా కార్యక్ర మాలు, ఉపాధి ఆధారిత కార్యకలాపాలు సేవా కార్యక్రమాలు సౌకర్యవంతంగా నిర్వహించుకో వచ్చని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సహకారం గ్రామ ప్రజల మద్దతుతో భవన నిర్మాణాన్ని నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ/పిఆర్ఓ జానయ్య, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మచారి, ఉపసర్పంచ్ గాదే సైదులు, వార్డ్ సభ్యులు వీరమల్ల కార్తీక్ గౌడ్, టంగుటూరి పద్మ, సంపంగి సత్తమ్మ, గ్రామస్తులు వివో వీరమల్ల రమేష్, మన్నె భీమారెడ్డి, సందీప్, రవీందర్ రెడ్డి, గణేష్, ఇద్దయ్య, సంఘం సభ్యులు నందిని, రంజానా, జయమ్మ మరియు కారోబార్ స్వామి, శ్రీను, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి దిశగా మహిళల శక్తివంతీకరణకు ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# యంత్రాలు ,మంత్రాల పేరుతో మోసం

## 30గ్రాముల బంగారం చైన్, మొబైల్ స్వాదీనం, మోసగాడి అరెస్టు.. టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనర్సయ్య



**మిర్యాలగూడ ఫిబ్రవరి 24:-( ప్రభాత సూర్య):** పూజలు, మంత్రాల మరియు యంత్రాల పేరుతో ఘరానా మోసం చేస్తూ ప్రజల వద్ద నుండి బంగారాన్ని, డబ్బులను అక్రమంగా తీసుకుంటున్న నిందితున్ని అరెస్ట్ చేసిన మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె. సోమనర్సయ్య విలేఖరులకు మంగళవారం తెలిపారు.నిందితుడి నుండి సుమారు 30 గ్రాముల బంగారపు చైన్, వీవో వి 29ఇ 5జి మొబైల్ స్వాదీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర రాజు పర్యవేక్షణలో మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు, నల్లగొండ జిల్లా పోలీసులు నిందితుడిని తీసుకున్నారు.ఆదుపులోకి తీసుకున్న ప్రధాన నిందితుని వివరాలు వెల్లడిస్తూ సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్)మండలం గట్టికల్ గ్రామానికి చెందిన వ్యవసాయం చేసుకుంటున్న ఆయుర్వేదిక్ డాక్టర్ కోన వినోద్ కుమార్.నిందితుడు సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో, జల్సాలకు అలవాటు పడిన వినోద్ నాటు వైద్యం, మంత్రాల పేరుతో అమాయకుల ప్రజల టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేసి ఆనారోగ్యం తగ్గిస్తాను అని నమ్మించి, నగదును, బంగారాన్ని అని మాయ మాటలు చెప్తూ మోసం చేసి ముడుపు రూపంలో తీసుకుంటున్నాడు. అందులో భాగంగా మిర్యాలగూడ పట్టణం రాఘవేంద్ర కాలనీకి చెందిన ఆడవత్ శిరీష, ఆమె భర్త గోవింద్ లు కలిసి వారి ఇద్దరి మగ పిల్లలను నూతనకల్ లో ఉన్న వినోద్ వద్దకు అప్పుడప్పుడు తీసుకొని వెళ్ళి వినోద్ వద్ద పిల్లలకు కాళ్ళ కడియాలు చేపించేవారు. నిందితుడు వారి నమ్మకాన్ని అదునుగా తీసుకొని వారికి ఏదైనా మాయ మాటలు చెప్పి వారిని మోసం చేయాలని నిర్ణయించుకొని, గత కొన్ని రోజుల క్రితం వినోద్ మిర్యాలగూడలోని రాఘవేంద్ర కాలనీలో గల సదరు శిరీష కిరాయి ఇంటికి వెళ్ళి, శిరీష భర్త అయిన గోవింద్ వైపు చూసి నీకు ప్రాణహాని ఉందని, ఆయుష్షు పెరగాలంటే పూజ చేయాలి, దేవతకు ముడుపు కట్టాలని చెప్పి భయపెట్టి సుమారు 5.7 తులాల బంగారం, 013,200 ఫోని ద్వారా తీసుకున్నాడు. ముడుపు పేరిట బంగారాన్ని గుడ్డలో కట్టి, 41 రోజులు విప్పవద్దని చెప్పి, వారు కళ్ళు మూసుకుని ప్రార్ధన చేస్తున్న సమయంలో బంగారాన్ని తీసుకున్నాడు. ఈ విషయమై మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయగా, కేసులో మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని సెక్షన్ 318(4), 308(2) 351(2) బిఎన్ఎస్ క్రింద కేసు నమోదు చేసి రిమాండ్ చేశామన్నారు. కేసులో క్షుణంగా విచారణ జరిపి నేరంలో భాగస్తులైన ఇతర నేరస్తులను కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. నిందితుడిని స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా జ్యూడిషియల్ కస్టడీకి తరలించామని ఆదేశాలిచ్చారని తెలిపారు.అదేవిధంగా నిందితుడు ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. మేళ్లచెరువు గ్రామంలో పెళ్లి పేరు చెప్పి 6 తులాల బంగారం తీసుకుని ఇండియనమనీ.కం ద్వారా గోల్డ్ లోన్ తీసుకున్నాడన్నారు. నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామంలో ఒక కుటుంబాన్ని బెదిరించి బంగారం తీసుకుని లోన్ పొందాడ న్నారు.సూర్యపేట పట్టణంలో కూడ ఇలాంటి పద్ధతిలో బంగారం మోసం చేసినట్లు ఒప్పుకున్నాడ న్నారు.నూతనకల్ మండలం పెద్దనెమలి గ్రామంలో ఒకరిని వారం రోజుల్లో చనిపోతావని భయపెట్టి బంగారం, వెండి, నగదు తీసుకున్నాడు.కేసును ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో డిఎస్పి కె.రాజశేఖర రాజు ఆధ్వర్యంలో కేసును చేదించినటూ టౌన్ ఇన్స్పెక్టర్ జె.సోమనర్సయ్య, ఎస్ఐ బి.రాంబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు. నకిలీ నాటు వైద్యులను, నకిలీ భూత వైద్యులను, బాబాలను నమ్మి మోసపోరాదని ప్రజలకు సూచించి హెచ్చరించారు.

## ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణకు
# పటిష్టమైన ఏర్పాట్లు :జిల్లా కలెక్టర్ ప్రావీణ్య






**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 24:** జిల్లాలో రేపటి నుండి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.పరీక్షల నిర్వహణపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా నుండి పరీక్షా కేంద్రాలకు చేరేవరకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్ కొరత లేకుండా, విద్యార్థులకు తగిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లాలో పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సీఎస్కు వివరించారు.ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది అదనపు సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,762 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 18,224 మంది విద్యార్థులు హాజరు. కానుండగా, జిల్లాలో మొత్తం 35,986 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 24,657 మంది విద్యార్థులు హాజరుకానున్నారనీ ,ఈ పరీక్షల కోసం 123 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కేంద్రాలను ముందస్తుగా తనిఖీ చేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేసామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం ఒక గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించామని, సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లో అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ పాండు, డీఈవో వెంకటేశ్వర్లు, డిఐఈఓ గోవింద్ రామ్, డిటిఓ కవిత, జడ్పీ సీఈవో, డిపిఓ జానకి రెడ్డి, డిఎంఎల్హెచ్ఓ వసంత్ రావు, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీసీఎం డ్రైవర్ల అసోసియేషన్ నూతన మండల కమిటీ ఎన్నిక



**వేములపలి ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య న్యూస్ :** వేములపల్లి మండల డీసీఎం ట్రాన్స్పోర్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ (బిఎంఎస్) సమావేశం మంగళవారం మండలంలో జరిగింది. ఈ అసోసియేషన్ కి శివాజీ మహారాజ్ యూనియన్ గా నామకరణం చేశారు. డీసీఎం ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా నక్క శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ప్రధాన కార్యదర్శిగా నిమ్మోజు నరేష్, కోశాధికారి దుండిగల నరేష్, నూతన పాలకవర్గాన్ని బిఎంఎస్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలపై భారతీయ మజ్దూర్ సంఘంతో కలిసి నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా సెక్రటరీ అశోక్ రెడ్డి, బిఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ మజ్జిగ జంగారెడ్డి, డివిజన్ సెక్రెటరీ దేవరశెట్టి అనిల్, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ , తదితరులు పాల్గొన్నారు



## నర్సాపూర్ మండలంలో
## విదేశీ మద్యం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు



**ప్రభాత సూర్య నర్సాపూర్ ఫిబ్రవరి)24:** భారీ ఎత్తున విదేశీ మద్యం పట్టుకున్న సంఘటన మెదక్ జిల్లా లో జరిగింది.మెదక్ జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నర్సాపూర్ మండలం ఖాగజ్ మద్దూరు గ్రామ శివారులో మరిడి బయో పరిశ్రమ కొన్ని సంవత్సరాలుగా నిర్వాహకులు నిర్వహిస్తున్నారు.అందులో వివిధ పరిశ్రమలు,ఆసుపత్రులనుండి వ్యర్థాలను తీసుకువచ్చి ధ్వంసం చేస్తారని వారు తెలిపారు.దీంతో పాటు ఆబ్కారీ శాఖ అధికారులు గంజాయి,అక్రమ మద్యం, విదేశీ మద్యం బాటిల్లు కూడా ఇక్కడే ధ్వంసం చేస్తారని అన్నారు. కాగ గత నెల హైదరాబాద్ లో విదేశీ మద్యం పట్టుబడింది. ఆ మద్యాన్ని ధ్వంసం చేయడానికి అధికారులు ఇక్కడికి తరలించినట్లు తెలిపారు.దీనికి సంబంధించిన అందులో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు అభయ్ కుమార్, షేక్, నాగుల్, మీరా కుమార్, సాయి, రాజేష్ కలసి వాటిని దాచిపెట్టినట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడి నిర్వహించినట్లు తెలిపారు.దాడిలో 783 విదేశీ మద్యం బాటిల్లు, వీటి విలువ 587 లీటర్లు కాగ 40 లక్షల రూపాయల విలువ ఉంటుందని ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు.దాడిలో బాగంగా అందులో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో డివిజన్ లోని ఆబ్కారీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ .....



**ఆలేరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య.:** ఆలేరు నియోజవర్గంలోని కైలాసపుర కాచారం గ్రామంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం రోజున ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ అమ్మవారికి మొక్కు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఒడిబియ్యం పంపిణీ చేశారు.. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి వారిని ఘనంగా శాలువాలతో సన్మానించారు.వారికి ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు బిజిని కళ్యాణి మధు, పాకాల మౌనిక హరీష్, మరియు కొత్తూరు నాగరాజు, జయశ్రీ ,సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చింతరాం దంపతులు ఆలేరు మున్సిపల్ చైర్మన్ అమ్మవారికి మొక్కు చెల్లించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



# మీ ఆలోచనే మీకు పెట్టుబడి

## గీతంలో నిర్వహించిన ముఖాముఖిలో వజ్ర ఆటోమేషన్ పూర్వ సీఈవో వెల్లడి





**పటాన్చెరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య :** మండలం లోని ఒక మంచి ఆవిష్కరణ లేదా ఆలోచననే నేడు పెట్టుబడిగా, లేదా మేధో మూలధనంగా పరిగణిస్తున్నారని వజ్ర ఆటోమేషన్ పూర్వ కార్యనిర్వహణాధికారి (సీఈవో) జె. శ్రీనివాసరావు చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎలక్ట్రానిక్స్ ప్యాకేజింగ్ లో అధునాతన ధోరణులు' అనే అంశంపై ఆయన మంగళవారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వర్ధమాన ఇంజనీర్లను ఆలోచింపజేసే, అంతర్దృష్టితో కూడిన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ఆరెంజ్ ఎకానమీ అనే భావనను వివరిస్తూ, దీనిని సృజనాత్మకత, ఆలోచనలు ఆర్థిక విలువను ఉత్పత్తి చేసే ఒక పర్యావరణ వ్యవస్థగా శ్రీనివాసరావు అభివర్ణించారు. వయస్సు, అనుభవంపై ఆవిష్కరణ ఆధారపడి ఉండదని, ఆలోచనలను ఫలితాలుగా మార్చగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆశాజనకమైన ఆలోచనలకు నిధులు సమకూర్చ డానికి నేడు పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారని, విద్యార్థులు ఆయా సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, వారి భావనలను మెరుగు పరచడానికి అర్థవంతంగా సంభాషించాలని సూచించారు. దాదాపు సగం కంటే ఎక్కువ స్టార్టప్ లు విద్యా ప్రాంగణాల నుంచే ఉద్భవిస్తున్నాయని శ్రీనివాసరావు వెల్లడించారు. విద్యార్థి క్లబ్ లను ఏర్పాటు చేయడం, సహచరులతో సహకరించడం, జట్టు కృషిని స్వీకరించడం మంచిదన్నారు. ఏ వ్యక్తీ ఒంటరిగా అన్ని రంగాలలో నైపుణ్యం సాధించలేడని ఆయన పునరుద్ఘాటించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక వాతావరణంలో విద్యార్థులు తక్షణమే స్పందించడం నేర్చుకోవాలని, నేటి ప్రపంచంలో ఒక దశాబ్దం కూడా చాలా ఎక్కువన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రాణించడం కోసం ఎన్పీటెల్ (ఛీుజుూ) వంటి వేదికలను ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. మానవ మెదడుకు పరిమితి ఉందంటూ, ఇది తరచుగా సృజనాత్మకత ఆలోచనను పరిమితం చేస్తుందని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. పలు వీడియో క్లిప్ లు, మన చుట్టూ నిత్యం జరిగే ఉదాహణలతో కూడిన ఫోటోలను చూపుతూ, విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలని, వారు గమనించిన దాని వెనుక ఉన్న ఆలోచనలను వ్యక్తపరచమంటూ ప్రోత్సహించారు. విస్తృతంగా చదవడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సహకార వాతావరణంలో మెదడు మరింత సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. సాంకేతిక మార్పును అందిపుచ్చుకోవడంలో విఫలమైతే, ఎందుకూ కొరగాకుండా పోతామని హెచ్చరించారు. మానవ మనుగడ, పురోగతి ఎలక్ట్రానిక్స్ పై ఎక్కువగా ఆధారపడి ఉందని, భవిష్యత్తు సాంకేతిక ఆవిష్కరణ నుంచి విడదీయరాదని శ్రీనివాసరావు స్పష్టీకరించారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. మాధవి నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, ప్రొఫెసర్ సీహెచ్. సుమంత్ కుమార్, డాక్టర్ ఎన్. శ్యామ్ సుందర్ సాగర్ కన్వీనర్లుగా వ్యవహరించారు. ఈ ముఖాముఖిలో ఈఈసీఈ విద్యార్థులు పాల్గొని, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ధోరణులపై ప్రశ్నలడిగి, వివరాలు తెలుసుకున్నారు.



## భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు రాష్ట్ర జనరల్ ను జయప్రదం చేయండి

**గట్టుపల్ ప్రభాత సూర్య ఫిబ్రవరి:24:** భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు రాష్ట్ర జనరల్ ను జయప్రదం చేయండి భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు ఉద్యమ కార్యకలాపాలను సమీక్షించుకొని నూతన కర్తవ్యాలను నూతన కమిటీని రూపొందించుకోవడానికి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ముక్తార్ పాషా ప్రాంగణంలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఒకటి మూడు,01/03/2026 నా జరుపుకుంటుంది ఈ సభను విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా ఇఫ్టు సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ గడ్డం నరసింహ మాట్లాడుతూ భారతదేశంలో యావత్ కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం సవరణ చేసింది ఇట్టి లేబర్ కోడ్లను తొలగించి కార్మికులకు న్యాయం చేయాలని ఈ దేశంలో రాష్ట్రంలో సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలపై వారి పోరాటాలపై నిరంతరం పోరాటం చేస్తుందని సంఘం తెలిపింది గడ్డం నరసింహ జిల్లా నాయకులు జిల్లా నాయకులు వల్లూరి మల్లేష్ డివిజన్ నాయకులు మాడుగుల దాస్ పి వై నాయకుడు గుండె సత్యనారాయణ చిలువేరు వెంకటేశం పెద్దగోని శంకరయ్య పెద్దగోని చంద్రయ్య వరికుప్పల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన మాజీ కౌన్సిలర్ గుత్త సమంత రెడ్డి.....



**ఆలేరు ఫిబ్రవరి 24 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్ ను మంగళవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుత్త సమంత రెడ్డి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలేరు గ్రామాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకెళ్లాలని కోరారు.

## మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డ్‌లో నాగుపాము కలకలం

### నేతల చేయూత.. పాము పట్టివేత



**మిర్యాలగూడ , ఫిబ్రవరి 24:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ 17వ వార్డులో నివాసం ఉంటున్న పానుగోత్ సైదా నాయక్ ఇంట్లో ప్రమాదకరమైన నాగుపాము కనిపించింది.విషయం తెలుసుకున్న వార్డు మాజీ కౌన్సిలర్ లావూరి రవి నాయక్ వెంటనే స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డికి సమాచారం అందించారు. వార్డు ప్రజల భద్రత దృష్ట్యా కౌన్సిలర్ గారు వెంటనే స్పందించి స్నేక్ క్యాచర్‌ను పిలిపించి పామును సురక్షితంగా పట్టించారు.సకాలంలో స్పందించి ప్రమాదాన్ని తప్పించిన కౌన్సిలర్ రవినాయకక్ కు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## బాల్యవివాహాలు నిర్మూలించాలి

### దామరచర్ల సీడీపీఓ చంద్రకళ



**మిర్యాలగూడ , ఫిబ్రవరి 24:-( ప్రభాత సూర్య) :** దామరచర్ల ప్రాజెక్టు పరిధి వేములపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో కన్వర్జెన్సీ మీటింగ్ సిడిపిఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలో గల గ్రామాలలో బాల్యవివాహాలు జరగకుండా నిర్మూలించడం, పిల్లల అక్రమ దత్తత జరగకుండా చూడాలని గ్రామ అధికారులు అందరికీ ఇట్టి విషయాన్ని తెలియజేయాలని మండలాధికారులకు చెప్పారు. ఎంపీడీఓ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పంచాయతీ సెక్రటరీలకు తెలియజేస్తామని బాల్య వివాహాలు జరగకుండా చూస్తామన్నారు. తహసీల్దార్ హేమలత మాట్లాడుతూ పరిధిలో ఉన్న జిపిఓలకు తెలియజేస్తామని చెప్పారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరిగిన కేసు నమోదు చేయడం జరుగుతుందని పిల్లల అమ్మకాలు జరిగిన అక్రమ దత్తత జరిగిన కేసు నమోదు చేయడం జరుగుతుందని మండలాధికారులకు తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న పోలీస్ డిపార్ట్మెంట్ కు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ ఎన్.చంద్రకళ, తహసీల్దార్ హేమలత, ఎంపీడీఓ జితేందర్రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీఓ లలిత, ఏపీ ఓ శ్రీనివాసరెడ్డి, సిహెచ్ఓ ప్రవీణ్, ఐకెపి సిసి గోపీనాథ్, సూపర్వైజర్ పి.రజనీ, అంగన్వాడీ టీచర్స్ జయమ్మ, రజిత పాల్గొన్నారు.

## మీ అరచాకాలను ఇక సహించేది లేదు

జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్ట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గా÷–జడెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమ్జ్గ÷న్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

## తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష



అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం.తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ – త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి.భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ – త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష – రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు – వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.



# పక్కా నీటి ప్రణాళికలే మేలు !

**పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో**



**చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది.**

తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఃూష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు–ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు

నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్ధంగా సాగాల్సిన విషయం. ఇందకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

## 15 ఏళ్ల అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

**మీ**కు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్‌సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10–15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

# శశికళ కొత్త పార్టీ...

**తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నాడీఎంకేలో తిరిగి చేరేందుకు ఆమె చేసిన ప్రయత్నాలను ఎడప్పాడి పళనిస్వామి వర్గం పూర్తిగా తిరస్కరించడంతో, ఆమె తన మద్దతుదారులతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.**



జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24, 2026న రామనాథపురం సమీపంలో శశికళ తన కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించే అవకాశం ఉంది. 2021 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆమె, ఈసారి మాత్రం సుమారు 40 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వం ఎంజీఆర్ , జయలలిత ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, పార్టీని మళ్లీ గాడిలో పెట్టడమే తన ఉద్దేశమని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. అవినీతి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించిన శశికళకు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో ఇప్పటికీ సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి.ఆమె అనర్హత కాలం వచ్చే ఏడాది ప్రారంభంలో ముగుస్తుంది, కాబట్టి ఆమె ఈ ఏడాది ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశం లేదు. అయినప్పటికీ, పార్టీని నడిపించడం , తన మద్దతుదారులను బరిలోకి దింపడం ద్వారా తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ఆమె భావిస్తున్నారు. శశికళ కొత్త పార్టీ వల్ల ప్రధానంగా అన్నాడీఎంకే కే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో బలమైన పట్టున్న తేవర్ సామాజిక వర్గం ఓట్లు అన్నాడీఎంకే నుండి శశికళ వైపు మళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే విజయ్ పార్టీ ఎంట్రీతో తమిళ రాజకీయాలు వేడెక్కగా, ఇప్పుడు శశికళ రంగంలోకి రావడం వల్ల ఓట్లు మరింతగా చీలిపోనున్నాయి. ఇది పరోక్షంగా అధికార డీఎంకే కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.శశికళ ప్రకటన అన్నాడీఎంకేలోని ఈపీఎస్ వర్గానికి పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఓ. పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్ వంటి నేతలు విడిపోయి ఉన్న తరుణంలో, శశికళ సొంత కుంపటి పెట్టడం వల్ల పార్టీ సంస్థాగతంగా మరింత బలహీనపడవచ్చు. అవినీతిపరులను పార్టీలోకి చేర్చుకోము అని పళనిస్వామి గట్టిగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ విడిపోవడం ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ద్విముఖ పోరాటం కాకుండా, డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, విజయ్–శశికళ వంటి చిన్న పార్టీల మధ్య బహుముఖ పోటీ సాగనుంది. శశికళ కేవలం 40 సీట్లలోనే ప్రభావం చూపినప్పటికీ, అన్నాడీఎంకే గెలుపోటములను శాసించే శక్తిగా మారే అవకాశం ఉంది. జయలలిత వారసురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ప్రజల్లో ఎంతవరకు పనిచేస్తుందనేది 2026 అసెంబ్లీ ఎన్నికలే తేల్చాలి.

# 'విష్ణు విన్యాసం' ఉత్సవం లాంటి సినిమా



'విష్ణు విన్యాసం' ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా చక్కటి వినోదంతో అలరిస్తుందని చెప్పారు చిత్ర హీరో శ్రీవిష్ణు. నయన సారిక కథానాయికగా నటించిన ఈ చిత్రానికి యదునాథ్ మారుతీ రావు దర్శకుడు. సుమంత్ నాయుడు జి నిర్మాత. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం టీజర్‌ను లాంచ్ చేశారు. ఇందులో హీరో శ్రీవిష్ణు జాతకాలు, వాస్తు పిచ్చి ఉన్న యువకుడిగా కనిపించారు. అతని ప్రేమప్రయాణంలో చోటుచేసుకున్న సంఘటనలు, ఈ క్రమంలో పండిన హాస్యం ఆకట్టుకునేలా ఉంది. శ్రీవిష్ణు మాట్లాడుతూ 'యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ మెప్పిస్తుంది. ఓ ఉత్సవం లాంటి సినిమా ఇది. ఒంగోలు నేపథ్యంలో సరదా సంభాషణలతో అందరిని నవ్విస్తుంది' అన్నారు. శ్రీవిష్ణు నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలున్న చిత్రమిదని దర్శకుడు తెలిపారు. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులు మనసారా నవ్వుకుంటారని నిర్మాత సుమంత్ నాయుడు జి చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: రథన్, రచన-దర్శకత్వం: యదునాథ్ మారుతీ రావు.

## అదే నిజమైన విజయం

"మజిలీ' నా కెరీర్‌కి బ్రేక్‌నిచ్చింది. ఆ టైమ్‌లో మంచి ఆఫర్లొస్తున్నాయి. ఓ పెద్ద హీరోయిన్‌తో కలిసి నటించే ఛాన్స్ వచ్చింది. అయితే సెట్‌లో ఒకతను నాముందే 'ఇతన్ని ఎందుకు పిలిచారు' అంటూ అవమానపరిచేలా మాట్లాడారు. అనంతరకాలంలో నేను.. కీర్తి సురేష్ వంటి స్టార్ హీరోయిన్‌తో కలిసి 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా చేశా. నా లైఫ్‌లో గొప్పగా ఫీలైన సందర్భం అది. నా దృష్టిలో అదే నిజమైన విజయం' అన్నారు సుహాస్. ఆయన శివానీ నగరంతో కలిసి నటించిన 'హే బల్‌వంత్' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. గోపీ అచ్చర దర్శకుడు. బన్నీవాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. బుధవారం 'నాట్ ఏ టైటిల్' పేరుతో ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుహాస్ పై విధంగా స్పందించారు. టైటిల్ మారినా ఈ సినిమా క్రియేట్ చేసే ఇంపాక్ట్ మారదని నిర్మాత వంశీ నందిపాటి తెలిపారు. తమ సంస్థకు తొలి చిత్రమిదని, విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని చిత్ర నిర్మాత బి.నరేంద్ర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.






## తెలంగాణ నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం'

సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకుంది. కొత్తదనం కలబోసిన కథల్ని ఎంచుకుంటూ పాత్రలపరంగా ప్రయోగాలకు సిద్ధమంటున్నది. తెలుగులో ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. బుధవారం అనుపమ పరమేశ్వరన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పెళ్లి కూతురుగా ముస్తాబై పట్టరాని ఆనందంతో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. పెళ్లి చుట్టూ సాగే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఆమె కీర్తి అనే పాత్రలో కనిపిస్తుందని, తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ ధూపాటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: బద్రప్ప గాజుల.

# ఓటీటీలో సస్పెన్స్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ప్రకటన



రాజీవ్ కనకాల, ఉదయబాను, ప్రధాన పాత్రధారులుగా నటించిన 'డాటరాఫ్ ప్రసాద్ రావు: కనపడుట లేదు' వెబ్ సిరీస్ విడుదలపై ప్రకటన వచ్చింది. ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ గతేడాదిలోనే స్ట్రీమింగ్ కావల్సి ఉంది. అయితే, పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. దర్శకుడు పోలూరు కృష్ణ తెరకెక్కించిన ఈ సిరీస్ 'జీ 5'(వవ 5)లో ఫిబ్రవరి 27 నుంచి స్ట్రీమింగ్ కానుందని అధికారికంగా ప్రకటించారు. రెక్కీ, విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్ వంటి సక్సెస్‌ఫుల్ సిరీస్‌లను అందించిన సౌతిండియన్ స్క్రీన్స్ దీన్ని రూపొందించింది. తండ్రీకూతుళ్ల అనుబంధంతో ఈ వెబ్ సిరీస్(ఙ/ూ ౖాతీఖుఖుస ఝశీ ఖుఖుఝుసఝ్ఝుశ్రీవసష్త్రబ )ను తెరకెక్కించారు. నటి వసంతిక ఇందులో రాజీవ్ కనకాల కూతురు స్వాతి పాత్రలో నటించింది. ప్రతి కుటుంబానికి కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్‌తో పాటు ఎన్నో సస్పెన్స్ పాయింట్స్‌ను దర్శకుడు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. తండ్రి ఆశయాలకు ఎంతో కష్టపడి ఉద్యోగంలో చేరిన కూతురు ఊహించని రీతిలో అదృశ్యమవుతుంది. ఈ మిస్సింగ్ కేసును ఛేదించేందుకు పోలీసు అధికారిణి (ఉదయభాను) రంగంలోకి దిగుతుంది. స్వాతిని కడ్నాప్ చేసింది ఎవరు..? ఆమెను టార్గెట్ చేయడం వెనుక ఉన్న కారణాలు ఏంటి..? అనేది తెరపై చూడాల్సిందే.



## మెగా కోడలి సతీ లీలావతి.. లవ్ సాంగ్ రిలీజ్

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా నటించిన చిత్రం సతీ లీలావతి. ఈ మూవీకి తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగ మోహన్ నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే సతీ లీలావతి మూవీ క్రేజీ లవ్ సాంగ్ విడుదలైంది. రిలీజ్ తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. తాజాగా ఈ మూవీ నుంచి మధురం అంటూ సాగే లవ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటకు వనమాలి లిరిక్స్ అందించగా.. కార్తీక్, చారులత మణి ఆలపించారు. మిక్కీ జే మేయర్ కంపోజ్ చేసిన ఈ పాట ఆడియన్స్‌ను తెగ అలరిస్తోంది. కాగా.. ఈ సినిమా మార్చి 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ మూవీలో నరేష్, వీటీవీ గణేష్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, తాగుబోతు రమేష్, జోషి కీలక పాత్రల్లో నటించారు.

# అల్లు అర్జున్- లోకేశ్ కనగరాజ్ సినిమా ప్రారంభం ఎప్పుడంటే..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే విడుదలైన స్పెషల్ వీడియో పాన్ ఇండియా రేంజ్‌లో వైరల్ అయింది. మిలియనల్ల కొద్ది వ్యూస్ రాబట్టింది. అయితే, ఈ మూవీ ఎప్పుడు ప్రారంభమవుతుంది అనేది క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే ప్రారంభించనున్నట్టు నిర్మాణ సంస్థ స్పష్టతనిచ్చింది. అల్లు అర్జున్ - అట్లీ (ూూా22) ప్రాజెక్ట్ కోసం ముంబైలో చాలా రోజులుగా మకాం వేశారు. అట్లీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ అంశాలతో ఉండబోతోంది. షూటింగ్ కూడా చాలా వేగంగా జరుగుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి కాగానే లోకేశ్ కనగరాజ్ మూవీ సెట్స్‌లోకి బన్నీ ఎంట్రీ ఇస్తాడు. ఇదే ఏడాదిలోనే షూటింగ్ మొదలు పెడుతామని చిత్ర యూనిట్ తెలిపింది. వీరిద్దరి కలయికపై అభిమానులలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇది తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలలో బాక్సాఫీస్ వద్ద సంచలనంగా మారనుంది. అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.